



1899లో ఫాక్స్‌సాగర్ నాలాకు శంకుస్థాపన చేసిన శిలాపలకం..

125 ఏళ్ళనాటి శిలాపలకం..


# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

మంగళవారం 19 ఆగస్టు 2025 పేజీలు 8


# విజిలెన్స్ వ్యవస్థ..! ఉనికిని కోల్పోతుందా..?

జేకేనగర్‌లో 2022 అక్టోబర్ 31న కూల్చిన నాటి.. ఫైల్‌ఫోటో..



**ప్రశ్నార్థకంగా మారిన విజిలెన్స్ పనితీరు..!**
**చారిత్రక ఆనవాళ్ళు అక్రమార్కులకు పట్టం..!**

- హైదరాబాద్ మహానగరం ముంపుకు ఇరిగేషన్, జీహెచ్‌ఎంసి పుణ్యమే..!
- ప్రమాదకర అక్రమ కట్టడాలు ప్రోత్సహించేదే జీహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఏ..
- చెరువులు, నాలాల కబ్జాలపై ముడుపులకే ప్రాధాన్యత ఇస్తున్న ఇరిగేషన్..
- గత పాలకుల నిర్వాకం,అవినీతి మయంగా అధికార యంత్రాంగం..!
- అదుపు చేయలేక విసిగెత్తిన ప్రస్తుత ప్రభుత్వం ఆపరేషన్ హైడ్రా ఏర్పాటు..
- అయినప్పటికీ సిస్టమ్ క్షీణించింది..! అవినీతి పెట్రేగి పోతోంది..!అస్తవ్యస్తంగా నియంత్రణ వ్యవస్థ..
- చారిత్రాత్మక చెరువులు, కుంటలు, కట్టుకాలువలు, ప్రధాన నాలాల కబ్జాల్లో అధికారులదే కీలకపాత్ర..?
- ప్రభుత్వ ఖజానాకు చేరాల్సినవి కూడా.. తమ ఖాతాలో జమకోసమే అధికారుల ఆరాటం..?
- అక్రమార్కులకి తప్పుడు సలహాలు సూచనలతో ప్రభుత్వ ఆస్తులు కనుమరుగు..
- చివరికి ఒక అధికారి పోస్టింగ్ కూడా.. స్థానిక శాసనసభ్యుని అనుమతి కావాల్సిన దుస్థితి..

- ఆపరేషన్ 'హైడ్రా' చర్యలు ప్రారంభంలో కఠినంగా ఉన్నప్పటికీ..! ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో విఫలం.
- టిజి-బిపాస్ చట్టం ..! హైడ్రా ఆవిర్భావం..! అమలు విధానం సరైనదే అయినప్పటికీ..!
- రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలై పోతుందనే నెపంతో..! పొలిటికల్ స్టంట్‌గా మారిందా..?
- హైదరాబాద్ నగరంలో చెరువుల ఆక్రమణల అంశాలపై హైడ్రా నిర్లక్ష్యం దేనికి సంకేతం..?
- చెరువుల కబ్జాలతో..! చెరువులను తలపిస్తున్న మహానగరం రహదారులు..



జేకేనగర్‌లో ప్రస్తుతం మళ్ళీ నిర్మాణాలు.. (2022 అక్టోబర్ 31న కూల్చిది ఇక్కడే)..

అవినీతి నిర్మూలనకు, పాలకులు ఉన్నతాధికారులు శపథం చేస్తున్నప్పటికీ..! ఆచరణలో మాత్రం విఫలమవుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. వివిధ విభాగల్లోని చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విజిలెన్స్ వ్యవస్థ తన ఉనికిని కోల్పోతుందని విమర్శలు వస్తున్నాయి.. ఆయా శాఖలపై సంబంధిత విజిలెన్స్ విభాగం, నిఘా కొరవడింది..! చెరువుల కబ్జాలు, నాలాల ఆక్రమణలు, అక్రమ కట్టడాలకు, చట్టంలోని లోపాలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల మంజూరు వంటి అంశాలు, విజిలెన్స్ వ్యవస్థ తీరును ఎండ గడుతున్నాయి.. చారిత్రక ఆనవాళ్ళు ఆక్రమణలకు గురవుతుంటే..! చోద్యం చూస్తూ, సంబంధిత అధికారులు అక్రమార్కులకి ఔట్‌రైట్‌గా సహకరించడంపై, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 18:

-2లో

### కూకట్‌పల్లిలో పది మీటర్ల నాలా మూడు మీటర్లు అయ్యింది..

## ఆక్రమణలు తొలగించిన హైడ్రా



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో హైడ్రా మరోసారి కొరడా ఝుళిపించింది. సోమవారం (ఆగస్టు 18) కూకట్‌పల్లి, ఏవీబీపురంలో నాలా ఆక్రమించి ఏర్పాటు చేసిన అక్ర్మ నిర్మాణాలను తొలగించింది. పరికి చెరువు నుంచి కూకట్‌పల్లి వెళ్లే నాలా కబ్జాలను తొలగించారు హైడ్రా అధికారులు. పరికి చెరువు నుంచి కూకట్ పల్లి వెళ్లే నాలా వెడల్పు 10 మీటర్లు ఉండగా, కబ్జాలతో 3 మీటర్లు అయింది. నాలాపైన వెలిసిన రెండు షట్టర్లను తొలగించారు. మ్యాన్‌హోల్ పైన ఏర్పాటు చేసిన సెల్ ఫోన్, ల్యాప్ టాప్ రిపేర్ షాప్ లను తొలగించారు హైడ్రా అధికారులు.

-3లో

### కాళేశ్వరంలో నీళ్లు లేకున్నా..

## గోదావరి బేసిన్ ప్రాజెక్టుల్లో జలకళ

**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం ప్రాజెక్టులో నీళు లేకున్నా.. మేడిగడ్డ ఆనకట్ట కుంగినా, అన్నారం, సుందిళ్లలో నీటిని ఆపకున్నా వర్షాలతో గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ జలకళ సంతరించుకున్నాయని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులు నిండటంతో ఉత్తర తెలంగాణలో వరద కాల్వలతోపాటు మిడ్ మానేరు, ఎల్‌ఎండీలో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతున్నాయని తెలిపింది.

-3లో



# విజిలెన్స్ వ్యవస్థ..! ఉనికిని కోల్పోతుందా..?




**ఫాక్స్‌సాగర్ నాలాపై అక్రమ నిర్మాణానికి విద్యుత్ అధికారుల ట్రాన్స్‌ఫార్మర్..**



**నాలాపైనే నిర్మాణం ఉన్నట్టు ఆధారం..**

- మొదటి పేజి తరువాయి
మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం, జీడిమెట్ల గ్రామ పరిధిలోని ఫాక్స్‌సాగర్ చెరువు 1897లో నాటి బ్రిటిష్ పాలకులు త్రాగునీటి కోసం నిర్మించినట్లు స్థానికులు చెపుతున్న నిజం.. 1899లో మూసీనదిని కలిపే అత్యంత వెడల్పుతో ఫాక్స్‌సాగర్ నాలాను నిర్మించిన శిలాపలకం నేటికీ చూడవచ్చు.. ప్రముఖ ప్రజాప్రతినిధి ధనాపేక్ష..! సంబంధిత నాలుగు శాఖల నిర్వాకం (రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసి, విద్యుత్) తో చారిత్రాత్మక చెరువు కబ్జాదారుల కబంద హస్తాల్లో బందిగా ఉంది.. ముఖ్యంగా నీటిపారుదల శాఖలోని అవినీతి అధికారుల చేతివాటానికి బలై పోతోంది.. జీహెచ్ఎంసి సర్కిల్-25 అధికారులు నాలా బఫర్ జోన్‌లోనే నిర్మాణ అనుమతులు వారిలోని అవినీతిని బయటపడుతుంది.. కస్టోడియన్‌గా వ్యవహరించే రెవెన్యూ శాఖ, నిబంధనలను పట్టించుకోకుండా విద్యుత్ కనెక్షన్‌లు ఇస్తున్నారని..! టిజిఎస్‌పిడిసిఎల్‌పై మొన్నటి తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యలు ప్రత్యేక నిదర్శనం.. ఈనాలుగు శాఖలపై విజిలెన్స్ వ్యవస్థలో ఏ ఒక్కరు స్పందించక పోవడంలో ఆంతర్యం..? ఈ శాఖల పనితీరు నచ్చకనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలో భాగమైన "ఆపరేషన్ హైడ్రా" ఏర్పాటు చేసినప్పటికీ..! చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు యధావిధిగా కొనసాగుతుండటం పలు ఆరోపణలకు తావిస్తోంది..

## జీహెచ్ఎంసి వైఫల్యంతో.. నాలాపై నిర్మాణ అనుమతులు..

ఫాక్స్‌సాగర్ నాలా ఆక్రమణ వ్యవహారంలో అక్రమంగా నిర్మాణ అనుమతులు ఈ శాఖల నిర్వాకాన్ని బట్టబయలు చేస్తోంది.. అధికారుల సహకారంతో చెరువులు, నాలాలపై అక్రమ నిర్మాణాలు వెలుగు చూస్తున్నాయి.. టౌన్‌ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన, పర్యవేక్షణ చేయకపోవడం, అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, ఆక్రమణలకు దారితీస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి.. ఫాక్స్‌సాగర్ నాలాపై "తిరుమల హైట్స్" అపార్ట్‌మెంట్..! జేకేనగర్‌లో నాలా బఫర్ జోన్‌లో, కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్-25 నుండి 4 నిర్మాణ అనుమతులు మంజూరు టౌన్‌ప్లానింగ్ అధికారి అవినీతికి అద్దం పడుతుంది.. తాజాగా నాలాపైనే నిర్మించిన మార్వాడి షాపింగ్ కాంప్లెక్స్‌కి మొదట 3 పర్మిషన్‌లు మంజూరు చేసిన జీహెచ్ఎంసి సర్కిల్-25, మళ్ళీ రద్దుచేసింది.. 2024 ఆగష్టు 16న సీజ్ చేసింది.. చివరికి, చట్టాలను అడ్డుపెట్టుకుని, నిర్మాణం పూర్తి చేయడానికి కూడా జీహెచ్ఎంసి సర్కిల్-25 అధికారులే కీలకంగా సహకరించడం విశేషం.. ఈ విషయంలో విజిలెన్స్ విభాగం నిర్లక్ష్యం కూడా ఉన్నట్లు తెలుస్తోంది..

## అక్రమ ట్రాన్స్‌ఫార్మర్‌ల మంజూరు..! విజిలెన్స్ నిఘా వైఫల్యం..?

జీహెచ్ఎంసీలో విజిలెన్స్ విభాగం ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.. హైడ్రా ఏర్పాటు తర్వాత విజిలెన్స్ సిబ్బంది బల్దియాకు రిపోర్టు చేయకపోవడం, హైడ్రాకే పరిమితమై, విజిలెన్స్ నిఘా కొరవడుతుందని ఆరోపణలు ఉన్నాయి.. ఈ నాలుగు శాఖల అధికారుల నిర్వాకంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువులు, నాలాల ఆక్రమణలతో వరదలతో ముంపు సమస్య తీవ్రమవుతుండగా..! సందిట్లో సడేమియా అన్నట్లు ఆక్రమణ దారుల అక్రమ కట్టడాలకు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు చేసి, మరింత బలం చేకూరుస్తున్నారు.. కేవలం విద్యుత్ కనెక్షన్‌లతో చెరువులు, చారిత్రక నాలాలు క్రమబద్ధీకరణకు కీలకంగా మారుతున్న విషయం అందరికీ తెలిసిందే..



**ఫాక్స్‌సాగర్ నాలాపై తిరుమల హైట్స్ అపార్ట్‌మెంట్..**

## జీహెచ్ఎంసీలో అవినీతి..? నీరసించిన విజిలెన్స్ విభాగం..

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)తో పాటు నీటిపారుదల, రెవెన్యూ, విద్యుత్ శాఖల్లో అవినీతి తాండవిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెరువులు, నాలాల ఆక్రమణలు, అక్రమ ట్రాన్స్‌ఫార్మర్‌ల మంజూరు వంటి అక్రమాలకు అధికారులు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారని, హైకోర్టు వ్యాఖ్యలతో స్పష్టమవుతుండగా..! ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో విజిలెన్స్ విభాగం తన ఉనికిని కోల్పోతూ..! విధుల్లో పారదర్శకత కనిపించడం లేదు.. ఈ నేపథ్యంలో, ఫాక్స్‌సాగర్ నాలా ఆక్రమణ కేసు ఒక ప్రధాన ఉదాహరణగా నిలుస్తోంది..




**తిరుమల హైట్స్ బ్యాక్ సైడ్ నాలాపైనే సెట్‌బ్యాకులు, కమాన్ నిర్మాణం..**

## ఫాక్స్‌సాగర్ నాలా బఫర్‌లో 4 పర్మిషన్‌లు..

జేకేనగర్ లేఅవుట్‌లో కబ్జాకు గురైన, పార్కుస్థలం ఫాక్స్‌సాగర్ బఫర్ జోన్‌లో ఉందని, వెంచర్ నిర్వాహకుడు వి.కృష్ణమూర్తి, లేఅవుట్ చేసినప్పుడే, ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా, పార్కు స్థలంగా కేటాయించారు.. జేకే నగర్‌లో ఫాక్స్‌సాగర్ నాలా పక్కనే (బఫర్ జోన్‌లో) ఉన్న ఈ పార్కు స్థలానికి జీహెచ్ఎంసి సర్కిల్-25 పట్టణ ప్రణాళిక నుండి నాలుగు నిర్మాణ అనుమతులు మంజూరు చేయడం గమనార్హం.. కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు 2021 ఫిబ్రవరిలో ఒకసారి..! 2022 అక్టోబర్ 31న మరోసారి ఈ నిర్మాణాలను కూల్చివేశారు.. అయితే, గతంలో కూల్చిన చోటనే, తాజాగా మళ్ళీ నిర్మాణాలు చేపట్టడంపై, రెవెన్యూ, ఇరిగేషన్ బహిరంగంగానే సహకరిస్తున్నారు.. అప్పుడు అక్రమం, ఇప్పుడు సక్రమం ఎలా అయిందో జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులే తేల్చాలి.. అయితే వెంచర్‌కి స్థలం విక్రయించిన కుటుంబీకుల, వారసులే ఈ కబ్జాలకు పాల్పడటం కొస మెరుపు..

## అక్రమ పర్మిషన్‌లు రద్దు చేయక పోవడానికి కారణం..?

జేకేనగర్ పార్కు స్థలం కబ్జాలో అధికారుల తీరు స్థానికులకు ఆగ్రహం తెప్పిస్తుంది.. జీహెచ్ఎంసి సర్కిల్-25 నిర్వాకంతో.. సైట్ వెరిఫికేషన్‌లో నాలాను చూపించకుండానే 4 నిర్మాణ అనుమతులు మంజూరు చేశారు..
నాలుగేళ్ళుగా సంబంధిత అక్రమ పర్మిషన్‌లు రద్దు చేయకపోవడం విశేషం..! ఈ వ్యవహారంలో నీటిపారుదల శాఖ వ్యవస్థ ఉందా, లేదా..? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.. 2020-21లో జీహెచ్ఎంసీ సర్కిల్-25 అధికారులు సైట్ వెరిఫికేషన్‌లో ఫాక్స్‌సాగర్ నాలాను పరిగణనలోకి తీసుకోకుండా (నాలాను ఇతరుల స్థలంగా చూపిస్తూ) నాలుగు నిర్మాణ అనుమతులు మంజూరు చేశారు.. గత నాలుగేళ్లలో రెండుసార్లు అక్రమ నిర్మాణాలను కూల్చినప్పటికీ, తాజాగా అదేచోట నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించడంలో, మూడు శాఖలు వెనకడుగు వేస్తున్నారు.. అక్రమంగా మంజూరు చేసిన అనుమతులను కూడా రద్దు చేయలేదు.. హైకోర్టు ఆదేశాలను సాకుగా చూపిస్తూ, కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.. పిటిషనర్ ఒకవేళ ఆక్రమణకు పాల్పడినట్లు రుజువైతే పిటిషనర్‌పై అధికారులు తీసుకునే చర్యలను ఈ హైకోర్టు నిరోధించదని ఆర్డర్‌లో స్పష్టతను ఇచ్చింది.. అయినప్పటికీ, ఈ కోర్టు ఆదేశాల సాకుతో, అధికారులు చర్యలకు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## కూకట్‌పల్లిలో పది మీటర్ల నాలా మూడు మీటర్లు అయ్యింది.. ఆక్రమణలు తొలగించిన హైడ్రా

- మొదటి పేజీ తరువాయి

నాలా ఆక్రమణతో సాయిబాబాకాలనీ, హెచ్ ఏ ఎల్ కాలనీ, మైత్రినగర్‌లో వరద ముంచెత్తుతోంది. దీనిపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో ఆక్రమణల తొలగించింది హైడ్రా.

## కాళేశ్వరంలో నీళ్లు లేకున్నా.. గోదావరి బేసిన్ ప్రాజెక్టుల్లో జలకళ

- మొదటి పేజీ తరువాయి

మహారాష్ట్ర, ఎగువన గోదావరి పరివాహకంలో కురిసిన వర్షాలతో ఎస్సారెస్పీకి మూడు రోజులుగా ఇన్ ఫ్లో కొనసాగుతోంది. సోమవారం మధ్యాహ్నం లక్షా 25వేల క్యూసెక్కులకు పైగా ఇన్ ఫ్లో ఉండగా.. ఔట్ ఫ్లో 76,867 క్యూసెక్కులకు పైగా ఉంది. కాకతీయ కాల్వకు 5,000 క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి 18 వేల క్యూసెక్కుల నీటిని ఇందిరమ్మ వరద కాల్వ ద్వారా మిడ్ మానేరుకు వదులుతున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వ 18.92 టీఎంసీలకు చేరుకొంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు. ఎల్లంపల్లి గరిష్ఠ నీటిమట్టం 148 మీటర్లు కాగా.. ప్రస్తుతం 147.55 మీటర్ల వద్ద నీటిమట్టం ఉంది. ఎస్సారెస్పీ పరివాహకంలో కురిసిన వర్షాలతో 48,293 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ తాగునీటితో పాటు ఎన్టీపీసీకి నీటిని విడుదల చేస్తున్నారు. నంది పంప్ హౌస్‌కు 6,300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఆగస్టు 13 నుంచి అయిదు రోజులుగా ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు 4.12 టీఎంసీల నీటిని వదిలారు. మిడ్ మానేరు జలాశయంలో 10.81 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుత నీటి మట్టం 309.63 మీటర్లు ఉండగా.. అది 311.14 మీటర్లకు చేరితే నీటినిల్వ 13.13 టీఎంసీలకు చేరుతుంది. అప్పుడు ఒక పంప్ ఆన్ చేయటం వీలవుతుందని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం ఉన్న ఇన్ ఫ్లో ప్రకారం ఆగస్టు 20వ తేదీ నుంచి పంపింగ్ ప్రారంభించే అవకాశాలున్నాయని నీటిపారుదలశాఖ ఇంజినీర్లు తెలిపారు. మిడ్ మానేరు నుంచి నాలుగు పంపులు రన్ చేయాలంటే నీటినిల్వ 25.77 టీఎంసీలకు చేరాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## మంజీరా నది ఉగ్రరూపం... ఏడుపాయల వనదుర్గ ఆలయం జలదిగ్బంధం...

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ ఆలయం ఆరో రోజు కూడా జలదిగ్బంధంలోనే కొనసాగుతోంది. సింగూరు ప్రాజెక్టు నుంచి భారీగా నీటిని దిగువకు విడుదల చేయడంతో మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో ఏడుపాయల ఆలయ ప్రాంగణం మొత్తం వరద నీటితో నిండిపోయింది.ఆలయం వద్ద ఉన్న వనదుర్గ ఆనకట్టపై నుంచి వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈ వరద ప్రవాహం నేరుగా ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించి, అమ్మవారి పాదాలను తాకుతూ రాజగోపురం ముందు నుంచి పారుతోంది. దీంతో ఆలయంలోకి భక్తులను అనుమతించడం సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. గత ఆరు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.భక్తుల దర్శనం కోసం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురం వద్ద ఏర్పాటు చేసి, అక్కడే పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు రాజగోపురం నుంచే అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. వరద ప్రవాహం ఎక్కువగా ఉన్న గర్భగుడి వైపు, వనదుర్గ ఆనకట్ట వైపు భక్తులు వెళ్లకుండా పహారా కాస్తున్నారు. మంజీరా నదికి వరద తగ్గే వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# కాంస్య పతకాలను సాధించిన అల్మాస్ గూడ శ్లోక సందర్భంగా ది గ్లోబల్ స్కూల్ విద్యార్థులు




**ఎల్బీనగర్ పెన్ పవర్ ఆగస్టు 18:** అల్మాస్ గూడ శ్లోక ది గ్లోబల్ స్కూల్ కు చెందిన విద్యార్థులు ప్రతిష్ఠాత్మకమైన ఇండో నేపాల్ టోర్నమెంట్ లో పాల్గొని జే.విశ్వేశ్ వెండి పతకం, శరత్ చంద్ర కాస్య పతకం, ప్రజ్ఞాన్ కాస్యం, శ్రీహన్స్ కాస్య పతకాలు సాధించారు. ఈ విజయానికి సహకరించిన కోచ్ సతీష్ ను, పతకాలను సాధించిన విద్యార్థులను చైర్మన్ పి. జైపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంజన, వైస్ ప్రిన్సిపాల్ నరేష్ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారి కృషి, క్రమశిక్షణ, పట్టుదలతో పాటు కోచ్‌ల శిక్షణ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఈ విజయం ద్వారా విద్యలోనే కాకుండా క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాలలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచే వేదికగా శ్లోక%-%ది గ్లోబల్ స్కూల్ నిలుస్తుందని మరోసారి రుజువైందని అన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని సూచించారు.

# బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్: రాజ్ కుమార్ రెడ్డి

## లింగోజిగూడలో పాపన్న గౌడ్ కు నివాళులర్పించిన రాజ్ కుమార్ రెడ్డి





**ఎల్బీనగర్ పెన్ పవర్ ఆగస్టు 18:** బడుగు, రాజ్యాధికారం కోసం నాడు అలుపెరుగని పోరాటం చేసి గోల్కొండ కోటను ఏలిన విప్లవ వీరుడు, బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గం లింగోజిగూడలోని గౌడ సంఘం కార్యాలయ ఆవరణలో ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి గౌడ సంఘం పెద్దలతో కలిసి రాజ్ కుమార్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు తన కులవృత్తిని సైతం పక్కనపెట్టి అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారం కోసం వీరోచిత పోరాటం చేసిన మహనీయుడు పాపన్న గౌడ్ అని అన్నారు. కనుమరుగై పోయిన తెలంగాణ మహనీయుల జీవిత చరిత్రలను ప్రస్తుతం వెలికి తీసి వారికి సముచిత స్థానం కల్పించడం అభినందనీయమని అన్నారు. పాపన్న జయంతి రోజున హైదరాబాద్ నడిబొడ్డున ఆయన విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేసి జయంతి ఉత్సవాలను రవీంద్ర భారతిలో అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. అనంతరం గౌడ సంఘం పెద్దలు రాజ్ కుమార్ రెడ్డిని శాలువతో సత్కరించి పాపన్న విగ్రహాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు గురుజాల దయానంద్ గౌడ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కందికంటి శ్రీధర్ గౌడ్, బాలరాజు గౌడ్, గౌడ కులస్తులు రవికుమార్ గౌడ్, యువకులు చిరంజీవి, శ్రీనివాస్, రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఒడిశాలో బయటపడ్డ 'బంగారం'.. ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు

హైదరాబాద్ పెన్ పవర్:భారతదేశం ఆర్థిక వ్యవస్థకు పెట్రోలియం, బంగారం వంటి కీలకమైన వనరుల దిగుమతులపై తీవ్రంగా ఆధారపడి ఉంది. మన దేశంలో ఉపయోగించే పెట్రోలియం ఉత్పత్తులలో దాదాపు 80% దిగుమతి అవుతోంది. అదే విధంగా బంగారం కూడా విదేశాల నుండి భారీగా దిగుమతి చేసుకుంటాం. ప్రపంచంలో బంగారాన్ని అత్యధికంగా వినియోగించే దేశాలలో భారత్ ఒకటి. ఈ అధిక దిగుమతులు విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడిని పెంచి, రూపాయి విలువను తగ్గిస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఒడిశాలో భారీ బంగారు నిల్వలు కనుగొనబడడం దేశానికి ఒక గొప్ప శుభవార్త. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (%+ూ×%) ఒడిశాలోని నాలుగు జిల్లాలలో ముఖ్యంగా దేబ్‌గఢ్, కియోంఝర్, మయూర్‌భంజ్, , సుందర్‌గఢ్ ప్రాంతాలలో దాదాపు 20 మెట్రిక్ టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయని అంచనా వేసింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థకు ఊరట కలిగించే ఒక ముఖ్యమైన పరిణామం.



**బంగారం: కేవలం ఆభరణం కాదు, ఆర్థిక శక్తి కూడా**

భారత సంస్కృతిలో బంగారం కేవలం ఆభరణం కాదు, ఆర్థిక స్థిరత్వానికి.. సంపదకు ప్రతీకగా కూడా భావిస్తారు. ప్రతి సంవత్సరం సుమారు 800 మెట్రిక్ టన్నుల బంగారం దిగుమతి అవుతోంది. ఈ భారీ దిగుమతుల వల్ల మన విదేశీ మారక నిల్వలు తగ్గిపోవడమే కాకుండా, డాలర్‌పై ఆధారపడటం మరింత పెరుగుతోంది. ఒడిశాలో లభించిన ఈ నిల్వలు దేశీయ ఉత్పత్తిని పెంచి, ఈ దిగుమతి భారాన్ని తగ్గిస్తాయి. అంతేకాకుండా, ఈ గనుల తవ్వకం వలన స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ఆర్థిక స్థితి మెరుగుపడటానికి ఇది ఎంతో తోడ్పడుతుంది.

**ఒడిశా ప్రభుత్వ కార్యాచరణ**

ఒడిశా ప్రభుత్వం ఇప్పటికే మైనింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ బంగారు గనులను పారదర్శకంగా వేలం వేయడం ద్వారా సమర్థవంతమైన కంపెనీలకు మైనింగ్ హక్కులు కేటాయించాలని యోచిస్తోంది. దీని వల్ల రాష్ట్రానికి గణనీయమైన ఆదాయం సమకూరుతుంది. ఆధునిక మైనింగ్ సాంకేతికతలను ఉపయోగించడం ద్వారా తవ్వకాలను సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా, పర్యావరణానికి జరిగే నష్టాన్ని కూడా తగ్గించవచ్చు. ఈ ఆదాయాన్ని రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య వంటి రంగాలలో పెట్టుబడులకు ఉపయోగించడం ద్వారా రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది.

**దిగుమతులు తగ్గుదల, రూపాయి బలోపేతం**

ప్రస్తుతం భారత్ బంగారం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతోంది. అయితే ఒడిశాలో కనుగొనబడిన ఈ నిల్వలు భవిష్యత్తులో దిగుమతులను కొంత వరకు తగ్గించగలవు.

దీనివల్ల విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి తగ్గి, రూపాయి విలువ స్థిరంగా ఉండే అవకాశం ఉంది. దీర్ఘకాలంలో ఇలాంటి మరిన్ని నిల్వలు బయటపడితే, భారత్ కేవలం దిగుమతులను తగ్గించుకోవడమే కాకుండా, బంగారాన్ని ఎగుమతి చేసే దేశంగా కూడా ఎదగగలదు.

ఒడిశాలో 20 మెట్రిక్ టన్నుల బంగారు నిల్వలు కనుగొనబడడం కేవలం ఒక ఖనిజ ఆవిష్కరణ మాత్రమే కాదు, భారత ఆర్థిక వ్యవస్థకు ఒక కొత్త ఉత్సాహాన్ని ఇచ్చే అంశం. ఇది బంగారం దిగుమతుల భారాన్ని తగ్గించడమే కాకుండా, స్థానిక ఉపాధి అవకాశాలను సృష్టించి, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుంది. ఈ ఆవిష్కరణ దేశానికి ఒక గొప్ప శుభసూచకంగా భావించవచ్చు.

# జగన్ స్టాండ్ మార్చుకుంటేనే...సరి లేకుంటే.. మళ్లీ అదే గతి




హైదరాబాద్ పెన్ పవర్:వైసీపీ అధినేత వైఎస్ జగన్ పై పడిన ముద్రను చెరిపేసుకోవాల్సి ఉంది. ఒకసారి ఆయన ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలో నెంబర్ వన్ గా నిలిచిన జగన్ డెవలప్‌మెంట్ విషయంలో మాత్రం వెనకపడ్డారనే చెప్పాలి. పోర్టులు, మెడికల్ కళాశాలలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేసినప్పటికీ ఆయనకు అభివృద్ధికి సంబంధించి మాత్రం బ్యాక్ బెంచ్ కే పరిమితమయ్యారు. ఆ ముద్రను మాత్రం చెరపేసుకోవాలని వైసీపీ కార్యకర్తలే కోరుతున్నారు. ముఖ్యంగా పారిశ్రామిక సంస్థలతో పాటు రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చి పెట్టడంలో ముందుండేలా ఎన్నికల హామీలను అమలు చేయాలని కూడా కార్యకర్తలు కోరుకుంటున్నారు.

**సంక్షేమంతో పాటు...**

తన ఆలోచనలు ఎలా ఉన్నప్పటికీ గత ప్రభుత్వం అనుసరించిన విధానాలను కూడా అనుసరిస్తానని చెప్పగలగాలి. మొన్నటి ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కూడా ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వచ్చినప్పటికీ జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని చెప్పి ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు. అదే పంథాను జగన్ కూడా వచ్చే ఎన్నికల్లో అనుసరించి, ప్రజలకు వివరించగలిగితేనే ప్రజలు కూడా విశ్వసించే అవకాశముందని కార్యకర్తలు గట్టిగా నమ్ముతున్నారు. వచ్చే ఎన్నికల్లో హామీల విషయంలో ఎంత నిక్కచ్చిగా ఉంటారో అలాగే అభివృద్ధికి సంబంధించిన హామీలను కూడా జనం ముందుంచడంలో జగన్ ముందుండాలని క్యాడర్ కోరుకుంటుంది.

**రాజధాని అమరావతి విషయంలో...**

ఒకరకంగా చెప్పాలంటే పోలవరం ప్రాజెక్టు విషయంలో జగన్ మనసులో మరో అభిప్రాయానికి తావులేదు. అదే సమయంలో రాజధాని అమరావతి విషయంలోనూ అదే స్టాండ్ ను బయటపెట్టగలగాలి. తాను అధికారంలోకి వచ్చినా అమరావతి రాజధాని నిర్మాణం కొనసాగుతుందని చెప్పాలి. అప్పుడే ప్రజలు విశ్వసిస్తారు. గతంలో మూడు రాజధానులంటూ చేసిన ప్రతిపాదనను మూడు ప్రాంతాల వారు విశ్వసించలేదనడానికి గత ఎన్నికల ఫలితాలే ఉదాహరణ. వచ్చే ఎన్నికల్లోనూ దానిపై ఏమీ మాట్లాడకోకుండా తప్పించుకోవాలని చూస్తే ముఖ్యంగా మధ్య, ఎగువ మధ్య తరగతి, కోస్తాంధ్ర ప్రజల నుంచి జగన్ ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందన్న హెచ్చరికలు సొంత పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. మరి జగన్ తన వాదనకే కట్టుబడి ఉంటారా? లేదా? అన్నది ఆయనకే వదిలేయాల్సి ఉంది.

# కూకట్‌పల్లిలో పదేళ్ల బాలిక దారుణ హత్య

## సంగీత్‌నగర్‌లో దారుణ ఘటన

## సెలవు కావడంతో ఇంట్లోనే ఉండిపోయిన కుమార్తె

## తండ్రి వచ్చేసరికి కత్తిపోట్లతో విగతజీవిగా పడి ఉన్న కుమార్తె



హైదరాబాద్ నగరంలో ఒక విషాదకర ఘటన చోటుచేసుకుంది. కూకట్‌పల్లిలోని సంగీత్ నగర్‌లో పదేళ్ల బాలిక దారుణ హత్యకు గురైంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. సంగీత్ నగర్‌లో నివసిస్తున్న దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భర్త బైక్ మెకానిక్‌గా, భార్య ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు.కుమార్తె కేంద్రీయ విద్యాలయంలో ఆరో తరగతి చదువుతోంది. సోమవారం ఉదయం తల్లిదండ్రులు కుమారుడిని పాఠశాలకు పంపించి, అనంతరం వారి విధులకు హాజరయ్యారు. కుమార్తెకు పాఠశాలకు సెలవు కావడంతో ఆమె ఇంట్లోనే ఉంది.మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో, కుమారుడికి భోజనం తీసుకెళ్లడానికి తండ్రి ఇంటికి వచ్చాడు. ఇంటికి రాగానే, బెడ్రూమ్?లో బాలిక కత్తి పోట్లతో విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి ఆయన దిగ్భ్రాంతికి గురయ్యాడు. వెంటనే ఆయన కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందించాడు. గుర్తు తెలియని దుండగులు బాలికను హతమార్చినట్లు పోలీసులు భావిస్తున్నారు.బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లతో ఆధారాలు సేకరించారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనారోగ్యంతో కోట శ్రీనివాసరావు భార్య రుక్మిణి మృతి.. భర్త చనిపోయిన నెల రోజులకే..



**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్ సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు చనిపోయిన నెల రోజుల వ్యవధిలోనే ఆయన భార్య రుక్మిణి కూడా కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఇవాళ (సోమవారం, ఆగస్ట్ 18, 2025) తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్?లో ఇప్పటికే ఆమె అంత్యక్రియలు కూడా పూర్తయ్యాయి. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను భర్త మరణం మరింత కుంగదీసింది. జులై 13, 2025న కోట శ్రీనివాసరావు 83 ఏళ్ల వయసులో చనిపోయారు. హైదరాబాద్?లోని ఫిల్మ్ నగర్ ఏరియాలో కోట శ్రీనివాస రావు నివాసం ఉంది. కోట శ్రీనివాస రావు, రుక్మిణి దంపతులకు ముగ్గురు సంతానం. ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. శోచనీయం ఏంటంటే.. కోట శ్రీనివాసరావు దంపతులకు పుత్ర శోకం వాళ్లు బతికి ఉన్నంత కాలం ఒక చేదు జ్ఞాపకంలా మిగిలిపోయింది. 2010 జూన్ 10న కోట శ్రీనివాసరావు కుమారుడు కోట వెంకట ఆంజనేయ ప్రసాద్ హైదరాబాద్?లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ బాధతో కోట శ్రీనివాసరావు, ఆయన భార్య రుక్మిణి ఏళ్ల తరబడి కుమిలిపోయారు.కోట శ్రీనివాసరావును జీవిత చరమాంకంలో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఇబ్బందిపెట్టాయి. ఆయన తన 83వ పుట్టినరోజు జరిగిన మూడు రోజులకే ప్రాణాలు కోల్పోవడం.. ఇండస్ట్రీలోని ఆయన సన్నిహితులను, కోట నటనను అభిమానించే సినీ ప్రేక్షకులను శోక సంద్రంలోకి నెట్టేసింది. కోట భార్య రుక్మిణి గృహిణిగానే ఉన్నారు తప్ప సినీ పరిశ్రమ ఛాయలు కూడా ఆమెపై పడలేదు. భర్త ప్రొఫెషనల్ లైఫ్?కు ఏనాడు ఆమె అడ్డంకి కాలేదు. కోట శ్రీనివాసరావు షూటింగ్స్?లో రోజుల తరబడి ఇంటికి దూరంగా ఉన్న రోజుల్లో కూడా.. పిల్లల యోగక్షేమాలు చూసుకుంటూ భర్తకు బలం గానే ఉంది తప్ప ఆమె ఎప్పుడూ కోటకు బలహీనతగా మారలేదు. అందుకే అన్ని ఏళ్ల పాటు వారి వైవాహిక బంధం అరమరికలు లేకుండా సాఫీగా సాగిపోయింది. జీవిత భాగస్వామి ఈ లోకాన్ని వీడిన రోజుల వ్యవధిలోనే కోట శ్రీనివాసరావు భార్య రుక్మిణి కూడా కాలం చేశారు.

## యిర్‌టెల్ సేవలు డౌన్: ఫోన్లు కలవటలేదు.. నెట్ పనిచేయట్లేదు..!

**హైదరాబాద్ పెన్ పవర్:**దేశవ్యాప్తంగా మొబైల్ కమ్యూనికేషన్లో టాప్ కంపెనీల్లో ఒకటి ఎయిర్‌టెల్. ఆగస్టు 18 మధ్యాహ్నం నుంచి అనూహ్యంగా సేవల్లో సాంకేతిక అంతరాయం ఎదురైంది. ఈ అవుటేజ్ కారణంగా వేలాది మంది వినియోగదారులు కాల్స్ చేయలేకపోవడం, మొబైల్ డేటా పనిచేయకపోవడం, లేదా పూర్తిగా సిగ్నల్ లేకపోవడం వంటి ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సోషల్ మీడియాలోనూ, అవుటేజ్ ట్రాకింగ్ ప్లాట్ ఫారమ్లలోనూ వినియోగదారులు

ఈ సమస్యపై పోస్టులు పెడుతున్నారు. మధ్యాహ్నం సుమారు 4 గంటల సమయంలో అకస్మాత్తుగా సేవల్లో అంతరాయానికి సంబంధించిన ఫిర్యాదుల సంఖ్య పెరిగింది. సాధారణంగా కంపెనీపై రోజువారీగా కొద్ది డజన్లలోనే ఫిర్యాదులు నమోదవుతుంటే.. ఈసారి ఒక్కసారిగా 2,500కి పైబడిన రిపోర్టులు వచ్చాయి. ఈ అవుటేజ్ ముఖ్యంగా బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మెట్రో నగరాల వినియోగదారులను ఇబ్బందికి గురిచేసినట్లు వెల్లడైంది. 56 శాతం మంది కాల్స్ విషయంలో.. 26 శాతం మంది ఇంటర్నెట్ సేవల అంతరాయం, 18 శాతం మంది మ్బైల్ నెట్ వర్క్ సిగ్నలింగ్ సమస్యలను ఎదుర్కొన్నట్లు వెల్లడైంది.

# తులసి ఆకులతో ఈ ప్రయోజనం కూడా ఉందని తెలుసా?

- ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్‌ను 36 శాతం తగ్గించిన తులసి
- శాస్త్రీయ అధ్యయనంలో వెల్లడైన కీలక విషయాలు
- రక్తపోటును అదుపులో ఉంచి, నిద్రను మెరుగుపరుస్తుంది
- 100 మందిపై 8 వారాల పాటు జరిగిన పరిశోధన
- ఆయుర్వేదంలో 'జీవన ఔషధం'గా తులసికి గుర్తింపు




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆధునిక జీవనశైలిలో సర్వసాధారణమైన ఒత్తిడిని ఎదుర్కొనేందుకు మన పెరట్లోని తులసి మొక్క అద్భుతంగా పనిచేస్తుందని ఒక తాజా శాస్త్రీయ అధ్యయనం వెల్లడించింది. తులసి రసాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఒత్తిడికి కారణమయ్యే కార్టిసాల్ అనే హార్మోన్ స్థాయిలు ఏకంగా 36 శాతం వరకు తగ్గుతాయని పరిశోధకులు కనుగొన్నారు. ఈ పరిశోధన ఫలితాలు ఆయుర్వేదంలో తులసికి ఉన్న ప్రాధాన్యతను మరోసారి శాస్త్రీయంగా బలపరిచాయి.'నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్'లో ప్రచురితమైన ఈ అధ్యయనాన్ని అత్యంత కఠినమైన పద్ధతుల్లో నిర్వహించారు. 18 నుంచి 65 సంవత్సరాల మధ్య వయసు గల 100 మందిపై ఎనిమిది వారాల పాటు ఈ పరిశోధన సాగింది. ఇందులో పాల్గొన్న వారిని రెండు బృందాలుగా విభజించి, ఒక బృందానికి రోజూ రెండుసార్లు 125 మిల్లీగ్రాముల తులసి సారం మరో బృందానికి సాధారణ మందు (ప్లేసిబో) ఇచ్చారు. ఎవరికి ఏ మందు ఇస్తున్నారనే విషయం పరిశోధకులకు గానీ, పాల్గొన్నవారికి గానీ తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇలా చేయడం వల్ల ఫలితాలు మరింత కచ్చితంగా వస్తాయి.

ఎనిమిది వారాల తర్వాత ఫలితాలను విశ్లేషించగా, తులసి సారం తీసుకున్న వారిలో దీర్ఘకాలిక ఒత్తిడిని సూచించే వెంట్రుకలలోని కార్టిసాల్ స్థాయిలు 36 శాతం తగ్గినట్లు స్పష్టమైంది. అంతేకాకుండా, వారి లాలాజలంలో కూడా కార్టిసాల్ స్థాయిలు తక్కువగా నమోదయ్యాయి. దీనివల్ల శరీరం ఒత్తిడిని మరింత ప్రశాంతంగా ఎదుర్కొంటుందని తేలింది. రక్తపోటు నియంత్రణలోకి రావడం, నిద్ర నాణ్యత మెరుగుపడటం వంటి సానుకూల మార్పులను కూడా పరిశోధకులు గమనించారు. నిద్రలేమి సమస్యలు కూడా తగ్గినట్లు పాల్గొన్నవారు స్వయంగా తెలిపారు.

శరీరం ఒత్తిడికి గురైనప్పుడు కార్టిసాల్ హార్మోన్ విడుదలవుతుంది. ఇది దీర్ఘకాలం పాటు అధిక స్థాయిలో ఉంటే ఆందోళన, నీరసం, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. తులసి ఈ హార్మోన్ స్థాయిలను సహజంగా తగ్గించి శారీరక, మానసిక సమతుల్యతను కాపాడుతుందని ఈ అధ్యయనం నిరూపించింది. ఆయుర్వేదంలో తులసిని "జీవన ఔషధం" అని పిలవడానికి గల కారణాన్ని ఈ పరిశోధన బలపరిచింది. అయితే, తులసి సారాన్ని సప్లిమెంట్ల రూపంలో తీసుకునే ముందు, ముఖ్యంగా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్య నిపుణులను సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు. ఈ ఫలితాలు మన సంప్రదాయ వైద్య విధానాలకు ఆధునిక శాస్త్రం అందిస్తున్న మద్దతుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# ఒళ్లు దగ్గర పెట్టుకోకుంటే.. సీటు చిరిగి పోద్ది..ఎమ్మెల్యేలూ జర జాగ్రత్త




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మునుపటి మాదిరిలా లేరు. కఠిన నిర్ణయాలను తీసుకునేందుకు వెనకాడటంలేదు. అది పార్టీ నేతలు కావచ్చు. అధికారులు కావచ్చు. సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా పనిని బట్టి మాత్రమే చంద్రబాబు నాయుడు వారికి ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను వేగంగా అందిపుచ్చుకుని వెళ్లడంతో పాటుగా ముందుగా వెళ్లడమే కాదు సోషల్ మీడియాలో కూడా ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజల్లోకి వెళ్లగలిగేలా చూడగలగాలి. అలా కాకుండా నామ్ కే వాస్తే చేసిన వారిని ఎంపిక చేసి అవసరమైతే వచ్చే ఎన్నికలకు దూరంగా ఉంచడానికి కూడా సిద్ధమవుతున్నారు.

**పంతాలకు పోయి...**

ముఖ్యంగా మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు పట్టుదలలు, పంతాలకు పోవడంతో పాటు కనీసం అవగాహన లేకుండా వ్యవహరించడం పార్టీకి తలనొప్పిగా తయారయింది. ఎమ్మెల్యేలు కలెక్టర్లను, జాయింట్ కలెక్టర్లకు కూడా గౌరవం ఇవ్వకుండా సోషల్ మీడియాకు ఎక్కుతుండటంతో పార్టీ పరువు బజారున పడుతుంది. ఇటువంటి వారిని కంటిన్యూ చేస్తే అసలుకే ఎసరు వస్తుందని చంద్రబాబు నాయుడుకు తెలియంది కాదు. అందుకే ఆయన ఇప్పుడు మౌనంగా ఉన్నప్పటికీ తలెగరేసి, కాలరెగరేసే నేతలను మాత్రం ఖచ్చితంగా వచ్చే ఎన్నికలకు దూరంగా ఉంచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వారి వల్ల పార్టీకి జరిగే ప్రయోజనం కంటే నష్టం ఎక్కువని భావించినప్పుడు అంతకు మించిన కార్యాచరణ మరొకటి ఉండదు.

**జనంలో కలవని...**

సీనియర్ నేతలయిన దేవినేని ఉమ వంటి వారికి కూడా టిక్కెట్ ఇవ్వకపోయినా వారు పార్టీ లైన్ ను థిక్కరించడం లేదు. అలాంటిది కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు మాత్రం పార్టీ లైన్ ను థిక్కరించడాన్ని మాత్రం చంద్రబాబు సహించలేకపోతున్నారు. మంత్రుల్లో కూడా కొందరు ఇలాగే వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వానికే మచ్చ తెచ్చి పెట్టేదిగా ఉంది. రాయలసీమ

జిల్లాలు ఇందులో ముందున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో ఉన్న ఎమ్మెల్యేలు ఒకింత సీనియర్లకు గౌరవమిస్తూ, పార్టీ నేతలను కలుపుకుపోతున్నా వారు జనంలో కలవలేకపోవడం నష్టాన్ని తెచ్చిపెడుతుండటం ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించి పెట్టుకుంటున్నారు. వరసగా తప్పులను లెక్క వేస్తూ అవసరమైన సమయంలో నొక్కేందుకు చంద్రబాబు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరి ఎమ్మెల్యేలూ ఒళ్లు దగ్గర పెట్టుకోకుంటే.. సీటు చిరిగిపోవడం ఖాయమట. చూడండి మరి.

## ఏ సమస్య ఉన్నా నా దగ్గరికి రండి : ఫిలిం ఫెడరేషన్ సభ్యులతో చిరంజీవి



**హైదరాబాద్ పెన్ పవర్:** వేతనాలు పెంపు కోసం గత 15 రోజులుగా సినీ కార్మికులు స్ట్రైక్ చేస్తున్నారు. కానీ నిర్మాతలు, ఫెడరేషన్ మధ్య చర్చలు సఫలం కావడం లేదు. ఈ అంశంపై సోమవారం (ఆగస్టు 18) ఫిలిం ఫెడరేషన్ సభ్యులు చిరంజీవితో భేటీ అయ్యారు. తమ సమస్యలను చిరంజీవికి చెప్పుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన భేటీలో కార్మిక సంఘాల సమస్యలను విన్నారు చిరంజీవి. ఫెడరేషన్ కు ఏ సమస్యలు ఉన్నా తన వద్దకు రావాలని చిరంజీవి చెప్పినట్లు ఫెడరేషన్ సభ్యులు తెలిపారు. మళ్లీ మంగళవారం కూడా మరోసారి భేట కానున్నారు. దీనికి తోడు ఫెడరేషన్ సభ్యులు జనరల్ మీటింగ్ ఏర్పాటు చేసుకోనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ఫిలింఛాంబర్, ఫిలిం ఫెడరేషన్ సభ్యులను కలిపి చిరంజీవి మీటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 24 యూనియన్ల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తాం అంటే పెట్టుకోండని చిరు ఓకే చెప్పినట్లు తెలిపారు. ఫెడరేషన్ నిర్ణయాలు, చర్చలు, డిమాండ్లు కార్మికుల అందరికీ తెలియాల్సిన అవసరం ఉన్నందున మీటింగ్ పెట్టుకొమ్మని సూచించి నట్లు చెప్పారు. మరోవైపు ఛాంబర్ నుంచి కూడా పిలుపు వచ్చిందని అన్నారు. మాకు 30 శాతం వేతనాలు పెంచుతారని ఆశిస్తున్నాం.. కార్మికుల సమస్యలను నిర్మాతలు అర్థం చేసుకోవాలి.. అని అన్నారు ఫెడరేషన్ సభ్యులు. తమ సమస్యలను ప్రశాంతంగా విన్న చిరు.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారని అన్నారు. మరో రెండు రోజుల్లో చిరంజీవి ఈ సమస్యను పరిష్కరిస్తారని ఆశిస్తున్నామని అన్నారు.


## హీరో ధర్మ మహేష్‌పై గచ్చిబౌలి మహిళా పీఎస్‌లో కేసు నమోదు



**హైదరాబాద్ పెన్ పవర్:** సినీ నటుడు ధర్మ మహేష్?పై గచ్చిబౌలి మహిళా పోలీస్ స్టేషన్?లో కేసు నమోదు అయ్యింది. అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ ధర్మ మహేష్ భార్య చిరుమామిళ్ల గౌతమి గచ్చిబౌలి మహిళా పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసింది. భర్తతో పాటు అతడి కుటుంబ సభ్యులపైన ఫిర్యాదు చేసింది గౌతమి. సినిమా అవకాశాలు పెరగడంతో తర్వాత జల్సాలకు అలవాటు పడి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నటుడు ధర్మ మహేష్?తో పాటు అతడి కుటుంబ సభ్యులపై గచ్చిబౌలి మహిళ పీఎస్ పోలీసులు ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు. కాగా, ధర్మ మహేష్, గౌతమికి 2019లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. ఇంతకు ముందు కూడా వరకట్నం వేధింపుల ఆరోపణలపై పోలీసులు మహేశ్‌కు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు సమాచారం. అయినప్పటికీ ఏ మాత్రం మారని మహేష్ అలాగే వేధింపులు కొనసాగిస్తున్నాడని అతడి భార్య ఆరోపించారు. నటుడు ధర్మ మహేష్ సింధూరం, డ్రింకర్ సాయి సినిమాల్లో హీరోగా నటించి గుర్తింపు పొందాడు. ఇండస్ట్రీలో హీరోగా నిలదొక్కుకుంటున్న సమయంలో వరకట్న వేధింపుల వ్యవహారంతో బజారున పడటంతో అతడి టోటల్ సినీ కెరీరే ప్రమాదంలో పడే ఛాన్స్ ఉంది

# కోవిడ్ ఎఫెక్ట్: వయసు కంటే ముందే రక్తనాళాలకు వృద్ధాప్యం.. గుండెపోటు ముప్పుపై పరిశోధకుల హెచ్చరిక

- కోవిడ్ సోకిన వారిలో రక్తనాళాలకు అకాల వృద్ధాప్యం
- తేలికపాటి ఇన్ఫెక్షన్‌తోనూ గుండె, పక్షవాతం ముప్పు
- పురుషుల కంటే మహిళల ధమనులపైనే తీవ్ర ప్రభావం
- లాంగ్ కోవిడ్ బాధితుల్లో ఈ సమస్య మరింత ఎక్కువ
- వ్యాక్సిన్ తీసుకున్నవారిలో రక్తనాళాలు మెరుగ్గా ఉన్నట్టు గుర్తింపు




**హైదరాబాద్ పెన్ పవర్:**కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించి ఏళ్లు గడుస్తున్నా, దాని దీర్ఘకాలిక ప్రభావాలు ఒక్కొక్కటిగా బయటపడుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా జరిపిన ఒక విస్తృత స్థాయి అధ్యయనంలో కోవిడ్ ఇన్ఫెక్షన్, అది తేలికపాటిది అయినా సరే, మన రక్తనాళాలను వయసు కంటే ముందే బలహీనపరిచి, గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యల ముప్పును పెంచుతున్నట్లు వెల్లడైంది. ఈ ప్రభావం పురుషుల కంటే మహిళల్లో ఎక్కువగా ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఫ్రాన్స్‌లోని పారిస్ సిటీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రోసా మరియా బ్రూనో నేతృత్వంలోని పరిశోధక బృందం ఈ అధ్యయనం నిర్వహించింది. 16 దేశాలకు చెందిన సుమారు 2,390 మందిపై సెప్టెంబర్ 2020 నుంచి ఫిబ్రవరి 2022 మధ్య పరిశోధనలు జరిపారు. "కోవిడ్ వైరస్ నేరుగా రక్తనాళాలపై ప్రభావం చూపుతుందని మాకు తెలుసు. దీనివల్ల రక్తనాళాలు వయసు కంటే వేగంగా వృద్ధాప్యానికి గురవుతాయి. ఫలితంగా గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదం పెరుగుతుంది" అని ప్రొఫెసర్ బ్రూనో వివరించారు. ఈ అధ్యయన ఫలితాలను ప్రతిష్ఠాత్మక యూరోపియన్ హార్ట్ జర్నల్‌లో ప్రచురించారు. కోవిడ్ సోకని వారితో పోలిస్తే, ఇన్ఫెక్షన్‌కు గురైన వారందరిలో... ముఖ్యంగా మహిళలు, లాంగ్ కోవిడ్ లక్షణాలతో (ఆయాసం, అలసట వంటివి) బాధపడుతున్న వారిలో రక్తనాళాలు లేదా ధమనులు గట్టిపడినట్లు ఈ అధ్యయనంలో స్పష్టంగా తేలింది. అయితే, కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో ధమనులు అంతగా గట్టిపడలేదని, వారి పరిస్థితి కాస్త మెరుగ్గా ఉందని కూడా పరిశోధకులు గుర్తించారు. మహిళల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉండటానికి వారి రోగనిరోధక వ్యవస్థ పనితీరే కారణం కావచ్చని ప్రొఫెసర్ బ్రూనో అభిప్రాయపడ్డారు. "మహిళల రోగనిరోధక వ్యవస్థ వేగంగా, బలంగా స్పందిస్తుంది. ఇది ఇన్ఫెక్షన్ నుంచి వారిని కాపాడుతుంది. కానీ, అదే బలమైన స్పందన ఇన్ఫెక్షన్ తర్వాత రక్తనాళాలకు ఎక్కువ నష్టం కలిగించవచ్చు" అని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో, కోవిడ్ బారిన పడిన వారిలో గుండె సంబంధిత ముప్పును ముందుగానే గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# హెచ్‌సీఏ అక్రమాల్లో కేటీఆర్, కవితలది కీలక పాత్ర: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి

- హెచ్‌సీఏ అవకతవకల్లో క్విడ్ ప్రోకో జరిగిందన్న గురువారెడ్డి
- సీఐడీ దర్యాప్తులో చాలా విషయాలు వెలుగులోకి వస్తున్నాయని వెల్లడి
- కేటీఆర్ బంధువు రాజ్ పాకాలకు టిక్కెట్ల కాంట్రాక్టు ఇచ్చారని విమర్శ




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అక్రమాల వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత కీలక పాత్ర పోషించారని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురువారెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హెచ్‌సీఏ అవకతవకల్లో క్విడ్‌ప్రోకో జరిగిందని ఆయన అన్నారు. సీఐడీ దర్యాప్తులో చాలా విషయాలు వెలుగులోకి వస్తున్నాయని వెల్లడించారు. అన్ని రాష్ట్రాల అసోసియేషన్లు నిబంధనలు పాటించాలని బీసీసీఐ చెప్పిందని వెల్లడించారు. కోర్టుల్లో కేసులు వేస్తూ హెచ్‌సీఏ అవకతవకలకు పాల్పడిందని విమర్శించారు. కమిటీలలో మంత్రులు ఉండకూడదని చెప్పినప్పటికీ, బీసీసీఐ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్ కమిటీలో కేటీఆర్ కొనసాగారని ఆరోపించారు. కేటీఆర్ బంధువు రాజ్ పాకాలకు బీసీసీఐ టిక్కెట్ల కాంట్రాక్టు ఇచ్చారని ఆయన అన్నారు. పదేళ్ల నుంచి ఒకే ఆడిట్ రిపోర్టును ప్రతిసారి కాపీ పేస్ట్ చేసి, దానిని పాస్ చేస్తూ అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రతి సంవత్సరం క్లబ్బుల అభివృద్ధికి రూ. 6.10 కోట్లు ఇస్తున్నారని, అయితే టీమ్‌లు లేని క్లబ్బులకు కూడా ఇచ్చారని ఆయన అన్నారు. హెచ్‌సీఏ పరిపాలనా వ్యవహారాలకు కూడా నెలకు రూ. 12 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. నెలకు అంత మొత్తంలో ఎలా ఖర్చు చేశారని గురువారెడ్డి ప్రశ్నించారు.

# జీఎస్టీ సంస్కరణల ఊపు... భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్

- జీఎస్టీ సంస్కరణల వార్తలతో సానుకూల సెంటిమెంట్
- 676 పాయింట్ల లాభంతో సెన్సెక్స్
- 245 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- ఆటో, బ్యాంకింగ్ రంగ షేర్లలో భారీ కొనుగోళ్లు
- డాలర్‌తో పోలిస్తే బలపడిన రూపాయి




హైదరాబాద్ పెన్ పవర్:వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)లో రాబోయే సంస్కరణలపై సానుకూల అంచనాలతో భారత స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాలను నమోదు చేశాయి. ఆటో, బ్యాంకింగ్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాల్లో పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరగడంతో పెట్టుబడిదారుల సెంటిమెంట్ బలపడింది. ఫలితంగా, దేశీయ సూచీలు లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 676.09 పాయింట్లు లాభపడి 81,273.75 వద్ద స్థిరపడింది. ఉదయం సెషన్ భారీ గ్యాప్-అప్‌తో 81,315.79 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్, ఒక దశలో 81,765.77 వద్ద గరిష్ఠ స్థాయిని కూడా తాకింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 245.65 పాయింట్లు పెరిగి 24,876.95 వద్ద ముగిసింది. ప్రతిపాదిత జీఎస్టీ హేతుబద్ధీకరణ దేశీయ మార్కెట్లకు సెంటిమెంట్ బూస్టర్‌గా పనిచేసిందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. దీనికి తోడు, అమెరికా-రష్యా శిఖరాగ్ర సమావేశం ఎలాంటి ఉద్రిక్తతలు లేకుండా ముగియడం కూడా పెట్టుబడిదారుల ఆందోళనను తగ్గించిందని ఆయన వివరించారు. 2026 ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో డిమాండ్ పుంజుకుని, వినియోగ ఆధారిత రంగాలు రాణిస్తాయని అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ ర్యాలీలో ఆటోమొబైల్ రంగం ప్రధాన లబ్ధిదారుగా నిలిచింది. నిఫ్టీ ఆటో ఇండెక్స్ ఏకంగా 1,008 పాయింట్లు ఎగబాకింది. నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ఫిన్ సర్వీసెస్, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ సూచీలు కూడా లాభపడ్డాయి. అయితే, నిఫ్టీ ఐటీ మాత్రం నష్టాల్లో ముగిసింది. విశాల మార్కెట్లలోనూ ఇదే ధోరణి కనిపించగా, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 1 శాతానికి పైగా లాభపడ్డాయి. సెన్సెక్స్ లో మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధాన లాభాల్లో ఉండగా.. ఐటీసీ, టెక్ మహీంద్రా, ఎల్%ం%టీ, ఇన్ఫోసిస్ నష్టపోయిన వాటిలో ఉన్నాయి. ఇదే సమయంలో, డాలర్‌తో రూపాయి మారకం విలువ 24 పైసలు బలపడి 87.31 వద్ద ముగిసింది.

## ఆదిలాబాద్ జిల్లాలో ఉప్పెన కాలం నాటి పరిస్థితులు..
# భద్రతపై గ్రామాల్లో డప్పు చాటింపులు..!



హైదరాబాద్ పెన్ పవర్:ఆదిలాబాద్ జిల్లా జలదిగ్బంధంలో కూరుకుపోయింది. కుండపోత, క్లౌడ్ బరస్ట్.. ఇలా ఎంత చెప్పుకున్నా తక్కువే. భారీ వర్షాలకు గ్రామాలు, పట్టణాలు ఎక్కడ చూసినా నీళ్లే. వాగులు నదులైతుంటే.. ఊర్లు చెరువుల్లా మారిపోయాయి. చెరువులు, ప్రాజెక్టులు నిండు కుండల్లా మారినపోయాయి. భారీగా వస్తున్న వరద నీటిని దిగువకు వదులుతున్నారు అధికారులు. అయినప్పటికీ వరద జిల్లా మొత్తాన్ని కమ్ముకుంటోంది. నీటి గండం ఉందా అన్నట్లుగా ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

చెరువులు కట్టలు తెంచుకుని వస్తున్నాయా అన్నట్లుగా భారీ వరద ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలను భయపెడుతోంది. దీంతో పలు గ్రామాల్లో డప్పు చాటింపులు వేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. కొమురం భీం జిల్లా సిర్పూర్ టీ మండలం వెంకట్రావ్ పేట్ గ్రామంలో డప్పు చాటింపు వేశారు. భారీ వర్షాలతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందో.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారి చేశారు అధికారులు.నిర్మల్ జిల్లా భైంసా గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ వరద నీటితో ముంపు ప్రభావం మొదలైంది. ప్రాజెక్టులోకి 10 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. ఈ క్రమంలో అధికార యంత్రాంగం ప్రాజెక్టుకు సంబంధించిన మూడు గేట్లను ఎత్తివేసి సుద్ద వాగులోకి 13 వేల క్యూసెక్కుల నీటిని వదిలుతున్నారు. ఈ క్రమంలో సుద్ద వాగు పొంగి పొర్లుతూ ఉధృతితో ప్రవహిస్తోంది. ఇందులో భాగంగానే గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ వరద నీరు సుద్ద వాగు బైపాస్ రోడ్డు వంతెనను ముంచెత్తింది. ప్రాజెక్టు వరద నీరు బైపాస్ రోడ్డు వంతెన మీదుగా ప్రమాదకరంగా ప్రవహిస్తోంది . బైపాస్ రోడ్డు సైతం వరద నీటిలో కోతకు గురయ్యింది.మరోవైపు బోరజ్ మండలంలో తర్నామ్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉప్పెనను మరిపించేలా వాగు ప్రవహిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆ ఏరియాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు వాగు వైపు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రమాదాన్ని ముందే ఊహించి వర్షంలో సైతం అక్కడే ఉండి ప్రజలను అటుగా వెళ్లకుండా అడ్డుకుంటున్నారు.

**ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు.. గేట్లు ఎత్తిన అధికారులు:**

అటు నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులోకి రికార్డు స్థాయిలో వరదనీరు చేరుతోంది. ప్రాజెక్టు ఆరు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు అధికారులు. ఇన్ ఫ్లో10,294 క్యూసెక్కులు ఉండగా అవుట్ ఫ్లో 33,930 క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుతం నీటిమట్టం 694.900 అడుగుల వద్దకు చేరుకుంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 700 అడుగులు. ప్రస్తుతం నీటినిల్వ సామర్థ్యం 3.5 టీఎంసీలు. పూర్తి నీటినిల్వ సామర్థ్యం 4.6 టీఎంసీలు. మరోవైపు భారీ వర్షాలకు కొమురం భీం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 6 గేట్లను 3.0 మీటర్ల మేర ఎత్తి 38,763 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు అధికారులు. ప్రాజెక్టు నీటిమట్టం 243 మీటర్లు కాగా ప్రస్తుతం 237.80 మీటర్లకు చేరడంతో అధికారులు 6 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు మొత్తం నీటి సామర్థ్యం 10.393 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.872 ఉంది. ప్రాజెక్ట్ లోకి 26,667 ఇన్ ఫ్లో కొనసాగుతోంది. పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# స్కిబిడి.. డెలులు... కేంబ్రిడ్జి డిక్షనరీలో కొత్త పదాలు!




హైదరాబాద్ పెన్ పవర్: ప్రపంచంలోనే అత్యంత సుప్రసిద్ధ కేంబ్రిడ్జ్ డిక్షనరీ, ఆధునిక పోకడలకు అనుగుణంగా తనను తాను మార్చుకుంటోంది. ఇంటర్నెట్ ప్రపంచంలో విపరీతంగా వైరల్ అయిన 'స్కిబిడి', 'డెలులు' వంటి వింత పదాలకు ఇప్పుడు తన పదకోశంలో అధికారికంగా స్థానం కల్పించింది. గత ఏడాది కాలంలో సుమారు 6,000కు పైగా కొత్త పదాలు, జాతీయాలను చేర్చినట్లు డిక్షనరీ ప్రచురణకర్తలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆన్‌లైన్ సంస్కృతి, ముఖ్యంగా యువతరం వాడే భాష, రోజువారీ సంభాషణలపై ఎంతటి ప్రభావం చూపుతోందో ఈ కొత్త చేర్పులు స్పష్టం చేస్తున్నాయి. యూట్యూబ్‌లో సంచలనం సృష్టించిన 'స్కిబిడి టాయిలెట్' సిరీస్ ద్వారా ప్రాచుర్యం పొందిన 'స్కిబిడి' అనే అర్థంలేని పదం, 'డెలూషనల్' (భ్రమల్లో బతకడం) అనే పదానికి సంక్షిప్త రూపమైన 'డెలులు' వంటివి ఈ జాబితాలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ పదాలను జనరేషన్ జెడ్, జనరేషన్ ఆల్ఫా ఎక్కువగా వాడుతున్నారు.వీటితో పాటు, సోషల్ మీడియాలో సాంప్రదాయ జీవనశైలిని అనుసరించే మహిళలను ఉద్దేశించి వాడే 'ట్రాడ్‌వైఫ్' అనే పదం కూడా డిక్షనరీలో చేరింది. అలాగే, విలక్షణమైన ఫ్యాషన్ శైలిని తెలిపే 'లూక్', ఇన్‌స్పిరేషన్‌కు చిన్న రూపమైన 'ఇన్‌స్పో' కూడా స్థానం సంపాదించాయి. వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్‌లో భాగంగా, పని చేస్తున్నట్లు భ్రమింపజేసే వారిని సూచించే 'మౌస్ జిగ్లర్' అనే పదం సైతం ఇప్పుడు అధికారిక ఆంగ్ల పదజాలంలో భాగమైంది. పర్యావరణ ఆందోళనల నేపథ్యంలో, ఏళ్ల తరబడి పర్యావరణంలో ఉండిపోయే రసాయనాలను సూచించే 'ఫరెవర్ కెమికల్' అనే పదాన్ని కూడా చేర్చారు.ఈ విషయంపై కేంబ్రిడ్జ్ డిక్షనరీ లెక్సికల్ ప్రోగ్రామ్ మేనేజర్ కొలిన్ మెక్‌ఇంటోష్ మాట్లాడుతూ, "'స్కిబిడి' వంటి పదాలు డిక్షనరీలో చేరడం అసాధారణమే. కానీ దీర్ఘకాలం మనుగడలో ఉంటాయని భావించిన పదాలనే మేము చేర్చుతాం. ఇంటర్నెట్ సంస్కృతి ఆంగ్ల భాషను ఎలా మారుస్తోందో గమనించడం, దాన్ని మా డిక్షనరీలో పొందుపరచడం ఆసక్తికరంగా ఉంది" అని ఆయన వివరించారు.

## బైక్ పార్క్ చేసి నీళ్లలోకి దూకేశాడు.. హైదరాబాద్‌లో మూసీలో కొట్టుకుపోయిన యువకుడు !



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో యువకుడు మూసీ నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. నిత్యం రద్దీగా ఉండే ఛాదర్ ఘాట్ బ్రిడ్జి వద్దకు వచ్చిన ఓ యువకుడు.. బైక్ ను ఫుట్ పాత్ పై పార్క్ చేసి అమాంతం నీళ్లలోకి దూకేశాడు. అక్కడ ఉన్న కొందరు గమనించి కేకలు వేస్తు అక్కడికి చేరుకునే లోపే కొట్టుకుపోయాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యువకుడు తన బైక్ ను బ్రిడ్జి పై వదిలేసి నేరుగా వరద ప్రవాహంలోకి దూకినట్లు చెబుతున్నారు. దూకిన క్షణాల్లోనే అతడు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు.వెంటనే అక్కడున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించారు. వరద ఉధృతి కారణంగా గాలింపు చర్యలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆత్మహత్యా ప్రయత్నమా..? లేక వేరే కారణమా..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. బైక్ నంబర్ ఆధారంగా.. కిరణ్ గౌడ్ అని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది..!

## కూకట్‌పల్లి బాలిక హత్య కేసులో కీలక మలుపు.. సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో జరిగిన బాలిక హత్య కేసు దర్యాప్తులో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. లైంగిక దాడికి విఫలయత్నం చేయగా బాలిక తీవ్రంగా ప్రతిఘటించడంతోనే నిందితుడు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ఘటనకు సంబంధించి కీలక ఆధారాలను సేకరించిన పోలీసులు, నిందితుడు తెలిసిన వ్యక్తే అయి ఉండవచ్చని బలంగా అనుమానిస్తున్నారు.ఇంట్లో బాలిక ఒంటరిగా ఉన్న సమయం చూసి నిందితుడు అక్కడికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. మొదట ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించగా, బాలిక ప్రతిఘటించింది. ఊహించని ప్రతిఘటన ఎదురవడంతో ఆగ్రహానికి గురైన ఆ యువకుడు, తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి కిరాతకంగా హత్య చేశాడు.ఈ ఘటనకు సంబంధించిన కీలక దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. నిందితుడు ఇంటికి వచ్చి వెళుతున్న కదలికలను పోలీసులు గుర్తించారు. ఇంట్లో బాలిక ఒంటరిగా ఉందని కచ్చితంగా తెలుసుకొని రావడం, ఆమె ప్రతిఘటించినప్పుడు దారుణంగా హత్య చేయడం వంటి పరిణామాలను బట్టి నిందితుడు బాధితురాలికి బాగా తెలిసిన వ్యక్తి లేదా దగ్గరి బంధువై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

# మరో యుద్ధం జరగొచ్చు... అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక!

- ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనీ సలహాదారు యాహ్యా రహీమ్ సఫావీ హెచ్చరిక
- బలహీనంగా ఉంటే ఈ ప్రపంచంలో నలిగిపోతామని వ్యాఖ్య
- క్షిపణి, డ్రోన్, సైబర్ దాడుల సామర్థ్యం పెంచుకోవాల్సి ఉందని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:**మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. అమెరికా లేదా ఇజ్రాయెల్‌తో ఎప్పుడైనా మరో యుద్ధం సంభవించవచ్చని ఇరాన్ సంచలన హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీకి అత్యంత కీలకమైన సైనిక సలహాదారు యాహ్యా రహీమ్ సఫావీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలే తమ దేశంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేసిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.స్థానిక మీడియాతో మాట్లాడుతూ, ఇరాన్ ప్రస్తుతం శాంతియుత పరిస్థితుల్లో లేదని, యుద్ధ వాతావరణంలోనే ఉందని సఫావీ స్పష్టం చేశారు. “మేము శాంతి ఒప్పందంలో లేము, యుద్ధ స్థితిలో ఉన్నాము. అమెరికా లేదా ఇజ్రాయెల్‌తో మాకు ఎలాంటి ఒప్పందం లేదు. మరో యుద్ధం జరగవచ్చు, ఆ తర్వాత బహుశా యుద్ధాలు ఉండకపోవచ్చు” అని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రపంచంలో బలహీనంగా ఉన్న దేశాలు నలిగిపోతాయని, అందుకే ఇరాన్ తనను తాను బలోపేతం చేసుకోవాలని ఆయన అన్నారు. రక్షణ, దాడితో పాటు దౌత్య, మీడియా, క్షిపణి, డ్రోన్, సైబర్ రంగాల్లోనూ ఇరాన్ శక్తివంతంగా మారాలని సూచించారు. “మేము సైనికులుగా అత్యంత దారుణమైన పరిస్థితులను ఊహించే ప్రణాళికలు సిద్ధం చేస్తాం” అని యాహ్యా రహీమ్ సఫావీ తెలిపారు.ఈ వేసవిలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల తర్వాత ఈ హెచ్చరికలు వెలువడ్డాయి. జూన్‌లో ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు టెహ్రాన్‌లోని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండ్ సెంటర్లు, ఇతర స్థావరాలపై దాడులు చేశాయి. ఈ దాడులతో ఇరాన్ క్షిపణి, అణు కార్యక్రమాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. తమ దేశాన్ని నాశనం చేయాలనుకుంటున్న ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణి ముప్పును తొలగించేందుకే ఈ ఆపరేషన్ ప్రారంభించామని ఆయన అన్నారు.అదే సమయంలో, ‘ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్’ పేరుతో జూన్‌లో ఇరాన్‌లోని ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్‌లలో ఉన్న మూడు ప్రధాన అణు కేంద్రాలపై దాడులు చేసినట్లు అమెరికా రక్షణ విభాగం పెంటగాన్ కూడా ధృవీకరించింది. తాజాగా ఇరాన్ చేస్తున్న హెచ్చరికలతో మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ భయాలు నెలకొన్నాయి.

## పాపిష్టోళ్లారా..! ఈ పాప ఏం పాపం చేసిందిరా..? అమ్మ ల్యాబ్ టెక్నీషియన్.. నాన్న మెకానిక్.. ఏం చేశారని వీళ్లకింత కడుపుకోత..!



**హైదరాబాద్ పెన్ పవర్:**భార్య, భర్త ఇద్దరూ ఉద్యోగాలు చేస్తే గాని గడవని పరిస్థితి వాళ్లది. బతుకుదెరువుకై హైదరాబాద్ వచ్చి ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఎప్పట్లాగే ఎవరి పనులకు వాళ్లు వెళ్లిన సమయంలో.. ఉన్నట్లుండి గుండెలు పగిలే వార్త వినాల్సి వచ్చింది ఆ దంపతులు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కూతురు.. నట్టింట్లో రక్తపు మడుగులో పడి ఉందని తెలిసి గుండెలు బాదుకుంటున్నారు ఆ తల్లిదండ్రులు. హైదరాబాద్ కూకట్ పల్లిలో సోమవారం (ఆగస్టు 18) జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. అభంశుభం తెలియని పన్నెండేళ్ల బాలిక అత్యంత దారుణంగా హత్యకు గురైన ఘటన కూకట్ పల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని సంగీత్ నగర్ లో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చిన వెంకటేష్, రేణుక దంపతులు ప్రైవేట్ ఎంప్లాయిస్ గా పనిచేస్తున్నారు. వెంకటేష్ బైక్ మెకానిక్ గా పనిచేస్తుండగా.. రేణుక ల్యాబ్ టెక్నీషియన్. ఇద్దరూ ప్రైవేట్ జాబ్స్ చేస్తూ ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నారు. వీరి పెద్ద కూతురు సహస్ర (12) స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. సోమవారం (ఆగస్టు 18) ఉదయం 9 గంటలకు వెంకటేష్, రేణుక ఉద్యోగాలకు వెళ్లిపోగా సహస్ర ఇంటి వద్దనే ఉంది. బాలిక తండ్రి పాపకు లంచ్ బాక్స్ పంపాలనిమధ్యాహ్నం 12.30 గంటలకు ఆఫీసు నుండి ఇంటికి బయలుదేరాడు. ఇంటికి వచ్చి చూసే సరికి సహస్ర ఇంట్లోని మంచంపై రక్తపు మడుగులో పడి ఉంది. ఆమె ఒంటిపై కత్తిగాట్లు ఉన్నాయి. దీంతో మృతురాలు తండ్రి వెంకటేష్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాలిక మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మైనర్ బాలికను అత్యంత దారుణంగా హత్య చేసింది ఎవరు.? ఎందుకు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తమపై కక్ష్యతోనే ఈ దారుణానికి పాల్పడ్డారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమ మిగతా ఇద్దరు పిల్లలు కూడా ఇంట్లో ఉంటే వారిని కూడా చంపేసేవారేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.